## చింతపల్లిలో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

**చింతపల్లి ఆగష్టు 20 పెన్ పవర్**

మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి ని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలను ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




# పెన్ పవర్ ఉత్తరాంధ్ర

శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం। అనకాపల్లి। అల్లూరి జిల్లా


# లెని చిల్డ్రన్ హోమ్ వసతి గృహం సీజ్



## తహశీల్దార్ రామకృష్ణ

**చింతపల్లి ఆగష్టు 20 పెన్ పవర్**

ఇటీవల కోటవుర్ల మండలం కైలాసపట్నం అనాధాశ్రమంలో కలుషిత ఆహారం తిని ముగ్గురు గిరిజన విద్యార్థులు మృతి చెందిన సంఘటనను దృష్టిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేని చిల్డ్రన్ హోమ్ లను గుర్తించి సీజ్ చేయాలని ఆదేశించడంతో అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు స్థానిక తహశీల్దార్ ఆధ్వర్యంలో మండల పరిషత్, మండల విద్యాశాఖ, మహిళ మరియు శిశు సంక్షేమ శాఖ, పోలీస్ శాఖల సమన్వయంతో కమిటీ ఏర్పాటు చేసి మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ (ఐసిడిఎస్) పిడి సూర్యలక్ష్మి తో కలిసి తహశీల్దార్ టి రామకృష్ణ లెని చిల్డ్రన్ హోమ్, బాల సధన, వెనుకబడిన తరగతుల వసతి గృహలను సందర్శించి వసతి గృహాలలో వండిన భోజనం, వసతి సౌకర్యాలపై రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రామకృష్ణ మాట్లాడుతూ జిల్లా పరిషత్ గెస్ట్





హౌస్, అంతర్ల గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన లెని చిల్డ్రన్ హోమ్ వసతి గృహంలో సుమారు 24 మంది విద్యార్థిని, విద్యార్థులు ఉంటున్నారని, లెని చిల్డ్రన్ హోమ్ వసతి గృహంలో విద్యార్థిని విద్యార్థులకు సంబంధించి రికార్డులు లేవని, విద్యార్థులకు వసతి సౌకర్యం ఏర్పాటుకు కావాల్సిన ఆదాయ వనరుల రికార్డులు లేవని, నిర్వాహకులను ప్రశ్నిస్తే విద్యార్థుల ఆధార్ కార్డులు కూడ లేదని గుర్తించడం జరిగిందన్నారు. గిరిజన ప్రాంతంలో గిరిజన విద్యార్థులకు సంబంధించి గిరిజన పాఠశాలలు ఉన్నాయని ఆ పాఠశాలలలో బడుగు



బలహీన విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పించడం జరిగిందని ఆయన అన్నారు. 24 మంది విద్యార్థులను పాఠశాలలకు తరలించడం జరిగిందని, వారి ఆధార్ కార్డులు ఆధారంగా తల్లిదండ్రులను రప్పించి తల్లిదండ్రులకు పాఠశాలలు, వసతి గృహాలపై కౌన్సిలింగ్ నిర్వహించి, విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వ వసతి గృహాలలోనే రక్షణ ఉంటుందని వివరిస్తామన్నారు. లెని చిల్డ్రన్ హోమ్ వసతి గృహం సీజ్ చేయడం జరిగిందని కలెక్టర్ ఆదేశాలు వచ్చేంతవరకు సీజ్ చేసిన లెని చిల్డ్రన్ హోమ్ తెరవరాదని ఆయన అన్నారు. ఇదే భాగంలో చింతపల్లి సెంటెన్స్ హై స్కూల్ వసతి గృహం పరిశీలించారు వారి యొక్క రికార్డులు కూడా పరిశీలించారు, ఈ కార్యక్రమంలో ఏటిడబ్ల్యుఓ నాగ జయలక్ష్మి, మండల విద్యాశాఖ అధికారులు పనసల ప్రసాద్, జి బోడం నాయుడు, మండల అడ్మినిస్ట్రేషన్ అధికారి రవీంద్ర, పాడేరు చిల్డ్రన్ ఉమెన్ రైట్స్ ఆర్ ఉర్మిళ, ఉమెన్ మరియు చిల్డ్రన్ రైట్స్ అధికారి వెంకటరమణమూర్తి, సిడిపిఓ రామలక్ష్మి, సీఐ రమేష్, ఎస్సై అరుణ్ కిరణ్, ఆర్ఐ ఎం క్రిష్ణమూర్తి, వీఆర్వోలు ఎస్ కృష్ణారావు, ఎస్ విష్ణు, మహిళా పోలీస్ ఎం సునీత కుమారి, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఆశా కార్యకర్త నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

## అనాధలకు ప్రత్యేక పాఠశాలలు మంజూరు చేయాలి -సిపిఎం

**అరకులో పెన్ పవర్ ఆగష్టు 20**



అనాధ పిల్లలను ప్రభుత్వం నిర్లక్ష్యం వాయిస్తుందని, ఆదివాసి గిరిజన అనాధ పిల్లలకు ప్రభుత్వం భరోసా కల్పించాలని, ఆదివాసి గిరిజన అనాధ పిల్లలకు ప్రత్యేక పాఠశాల మంజూరు చేయాలని,సిపిఎం అల్లూరి జిల్లా కమిటీ మంగళవారం డిమాండ్ చేశారు,నిర్లక్ష్యం చేయడం వల్లనే అనాధ పిల్లలు ఆశ్రమల్లో పెరుగుతు వారు విచారం వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లాలో కలుషిత ఆహారాన్ని తీసుకుని చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని కోటవురట్ల మండలంలోని కైలాసపట్నం వద్ద గల పరిశుద్ధాత్మ అగ్ని స్తుతి ఆరాధన ట్రస్ట్ అనాధాశ్రమంలో కలుషిత ఆహారానికి బలి అయిన విద్యార్థుల పట్ల ప్రభుత్వం నైతిక బాధ్యత వహించి కుటుంబానికి శాశ్వత ఉపాధి కోసం రెండు(2) ఎకరాల భూమి,కుటుంబలకు ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఆశ్రమంలో ఉన్న అనాధ పిల్లలకు ఉచితంగా చదువు అందించడం కోసం ఏజెన్సీ 11 మండలాల్లో ప్రత్యేక పాఠశాలలు ప్రభుత్వం మంజూరు చేయాలని, అన్ని రకాల సౌకర్యంతో అనాధ పిల్లలకు తల్లితండ్రులు లేని లోటు ప్రభుత్వం సమకూర్చి విద్యను అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వా విధానాల వలన విద్యా వ్యాపారంగా సాగుతున్న ఈ కాలంలో అనాధ పిల్లలకు చదువు ఇవ్వలేని పరిస్థితికి రాష్ట్ర ప్రభుత్వాలు దిగజారయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి సమస్య భవిష్యత్తులో పునారవృత్తం కాకుండా అనాధ పిల్లలకు ఉచితంగా చదువు అందించడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## అమర్‌కు తెలుగు శక్తి హెచ్చరిక

**చంద్రబాబు పై మరోసారి ఇష్టానుసారం మాట్లాడితే సహించేది లేదు**

**చంద్రబాబు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారు**

**ఐదు సంవత్సరాల పాటు వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారు**

**ఆ 11 స్థానాలు కూడా వై.సీ.పీ.కి రావు -తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్**




**విశాఖ సిటీ, పెన్ పవర్, ఆగష్టు 20**

వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులకు చంద్రబాబు నాయుడు స్టికర్లు అతికిస్తున్నారని గుడివాడ అమర్నాద్ చేసిన వ్యాఖ్యల పై తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ స్పందించారు. మంగళవారం సీతమ్మ పేట లోని జనసేన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నిజంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏం చేసిందో తనతో చర్చకు రావాలని గతంలోనే పిలుపు నిచ్చాన ని.. ఆ చర్చలకు మొహం చాటేసిన గుడివాడ అమర్ ఇప్పుడు ప్రగల్బాలు పలకడం సరికాద న్నారు. ఐదేళ్లపాటు ప్రజలను పీడించుకుని తిన్న వైయస్ జగన్మోహన్ రెడ్డి సర్కారు రాష్ట్ర అభివృద్ధి కోసం చేసింది ఏమీ లేదన్నారు. ఉన్న పరిశ్రమలను కూడా పక్క రాష్ట్రాలకు పంపించి న ఘనత వైయస్సార్ ప్రభుత్వానికి చెందుతుం దని ఎద్దేవా చేశారు. వైయస్ జగన్ ప్రభుత్వంలో ప్రతి నెల అప్పులు చేసి నిర్వహణ బాధ్యతలు చూసేవారని, కానీ చంద్రబాబు అప్పుల ప్రస్థావన లేకుండానే నిర్వహణ బాధ్యతలను పూర్తి చేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన హీనమైన చరిత్ర వైఎస్ జగన్మోహన్ రెడ్డి అయితే.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే గొప్ప చరిత్ర నారా చంద్రబాబు నాయుడు దన్నారు. ఈ విషయాన్ని గుడివాడ అమర్ బాగా గుర్తుపెట్టుకోవాలని.. మరోసారి ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడితే సహించేది లేదన్నారు. ప్రజలకు జనసేన, బి.జె.పి, తెలుగుదేశం పార్టీ పై నమ్మకం ఉందని ఆ నమ్మకంతోనే.. వైసీపీకి బుద్ధి చెప్పారన్నారు. అయినప్పటికీ గుడివాడ అమర్ వైఖరిలో ఎంత మాత్రం మార్పు లేదని విమర్శించారు. ఇప్పటి కైనా బాధ్యతగా మెలగాలని గుడివాడ అమర్ కు రామ్ హితవు పలికారు. వై.సీ.పీ.కి రాబోయే 2029 ఎన్నికల్లో 11 అసెంబ్లీ స్థానాలకు కూడా గెలుచుకొనే పరిస్థితి ఉండదని.. తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ 175 కు 175 స్థానాలలోనూ విజయం సాధిస్తుందని తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ వ్యాఖ్యానించారు. ఈ విలేకరుల సమావేశంలో జనసేన నాయకు లు డాక్టర్ బొడ్డేపల్లి రఘు, కందుల నాగరాజు, డాక్టర్ పప్పూర్ నికుంజ్, ఎస్.ఎల్లాజీ రావు, వి.వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి సీలేరు

**స్టోరేజ్ ప్రాజెక్ట్ సమస్య -ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవాలని ఇంకా**

**వైసీపీ ముసుగులో ఉన్న అధికారుల తీరు -ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి**

**టీడీపీ అరకు పార్లమెంట్ బీసీ సెల్ అధికార ప్రతినిధి నక్కా తిరుమలరావు**





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఆగష్టు 20**

స్టోరేజ్ ప్రాజెక్టు కోసం ఉన్నతాధికారులు గత సంవత్సరం జీకే వీధి మండలం సీలేరు గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం వలన ఇక్కడ ప్రజలకు నష్టం జరగదు.ఒక వేల నష్టం జరిగినట్ల యితే అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తా మని జిల్లా ఉన్నతాధికారులు జెన్కో ఉన్నతాధికారులు ఇక్కడ ప్రజలకు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా ఇటీవల అధికారులు కొన్ని సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్న గిరిజనులకు గ్రామం ఖాళీ చేయమని నోటీసులు ఇచ్చారు.ఇచ్చిన మాట నిలబెట్టుకుని ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లేందుకు స్థానిక టీడీపీ నేతలు సంసిద్ధులవుతున్నారు.ఇక్కడ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని గిరిజన ప్రాంతంలో కడుతున్న పంపు స్టోరేజ్ ప్రాజెక్టు వలన రాష్ట్రమంతా విద్యుత్ విలువలు నింపుతుంటే ఇక్కడ కట్టే ప్రాజెక్టు వలన స్థానికులకు ఇబ్బంది కలిగించే పనులను అధికారులు మానుకోవాలని కోరుతున్నారు.అదేవిధంగా ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే విధానాలకు స్వస్తి పలకాలని కొందరు అధికారులు ఇంకా వైసీపీ ముసుగులో ఉన్నారనే వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి. వైసీపీ గవర్నమెంట్ ఉన్నప్పుడు ఏ తరహాలో ప్రవర్తించారో ఇప్పుడు కూడా అదే విధంగా ప్రవర్తిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.అప్పటి ప్రభుత్వంలో ఇక్కడ ప్రజలకు అన్ని వసతులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు భయభ్రాంతులకు గురి చేస్తూ ఈ ప్రభుత్వానికి మచ్చ తెచ్చేలా కొందరు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ఎప్పుడు పేద ప్రజల పక్షాన ఉంటుందని ఈ విషయమై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తున్నామని తెలుగుదేశం పార్టీ అరకు పార్లమెంట్ బీసీ సెల్ అధికార ప్రతినిధి నక్కా తిరుమలరావు తెలిపారు.ప్రాజెక్టు నిర్మాణంనకు అన్ని విధాలా సహకారం కావాలంటే ఇంటికి ఇల్లు షాపునకు షాపు ఏపీ జెన్కోలో ఉద్యోగం ఇవ్వాలని ఆయన కోరారు.

# అభివృద్ధి వైపు అయ్యన్న వడివడి అడుగులు



**నర్సీపట్నం, పెన్ పవర్ (ఆగష్ట్ 20)**

నర్సీపట్నం అభివృద్ధికి సభాపతి అయ్యన్నపాత్రుడు ప్రత్యేక ప్రణాలికలతో సిద్ధమవుతున్నారు. మున్సిపాలిటీలో అన్ని వార్డులలో నాలుగు కోట్ల రూపాయలతో సీసీ రోడ్లు వేయనున్నట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. మంగళవారం ఉదయం ఆయన నర్సీపట్నం ప్రధాన శ్మశానవాటికను సందర్శించారు. నర్సీపట్నంలో 12 స్మశానవాటికలను పార్కుల మాదిరిగా అభివృద్ధి చేయడానికి పలు ప్రైవేటు కంపెనీలను కోరామన్నారు. ఉత్తరవాహిని వద్ద వున్న ప్రధాన స్మశాన వాటికను సీఎంఆర్ షాపింగ్ మాల్ వారి సహకారంతో అభివృద్ధి చేయడానికి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలులు అభివృద్ధి పనులకు సహకరించాలని సూచించారు. వీటిని అభివృద్ధి చేసిన తరువాత, నిర్వహణ బాధ్యత స్వచ్ఛంగా తీసుకోవాలన్నారు.

మున్సిపాలిటీ పనితీరు పై ఆందోళన మున్సిపాలిటీ పనితీరుపై స్పీకర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిధుల కొరతతో అన్ని పనులు నిలిచిపోతున్నాయని అన్నారు. మున్సిపాలిటీ అధికారులకు పనితీరును మెరుగుపర్చాలని ఆదేశించారు.

**అభివృద్ధికి ప్రణాళికలు...:** నర్సీపట్నం ట్యాంక్ బండ్, కేడీపేట అల్లూరి పార్కు, లమ్మసింగి గెస్ట్ హౌస్, బొర్రా గుహలను అభివృద్ధి చేయడానికి కొత్త ప్రణాళికలు రూపొందిస్తున్నా మన్నారు. ఈ నెల 22న విశాఖపట్నం లో పర్యాటక మంత్రితో సమావేశం జరగనున్నట్లు స్పీకర్ తెలిపారు.

**మున్సిపాలిటీలో రహదారులు, డ్రైనేజీల అభివృద్ధి...:** ప్రస్తుతం మంజూరైన రూ. 4 కోట్ల నిధులతో మున్సిపాలిటీలో సిసి రోడ్ల అభివృద్ధి పనులు చేపడతారని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చడానికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని అన్నారు.

**హాస్పిటల్ అభివృద్ధికి జిల్లా అధికారులతో సమావేశం...:** ఈ నెల



30న ఏరియా ఆసుపత్రి నిర్వహణ తదితర అంశాలపై జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం జరపనున్నారు. గత ఐదేళ్ళలో హాస్పిటల్ భ్రష్టు పట్టిపోయిందని, నిధులు ఏవిధంగా ఖర్చు చేసింది చర్చిస్తామన్నారు. ఎంతో ముందుచూపుతో హాస్పిటల్ పైన సోలార్ సిస్టం ఏర్పాటు చేశామని, దాని నిర్వహణ పట్టని సిబ్బంది నిర్లక్ష్యం వల్ల అది మూలపడిందన్నారు. ప్రభుత్వ హాస్పిటల్ కు వచ్చిన డెలివరీ కేసులను, ప్రైవేటు హాస్పిటల్ కు మళ్ళించడం పైనా తమ వద్ద పిర్యాదులున్నాయన్నారు. హాస్పిటల్ అభివృద్ధికి మీడియా మిత్రులను సలహాలు, సూచనలు ఇవ్వాలని అయ్యన్న కోరారు.

### ముంచంగిపుట్టు మండలంలో 319 మూగ జీవాలకు

# గాలి కుంటువ్యాధి నిరోధక టీకాలు

## ఆగస్టు 20 నుండి సెప్టెంబర్ 18 వరకు జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం కార్యక్రమం నిర్వహణ


## మూగ జీవాలకు టీకాలు తప్పనిసరి -ముంచంగిపుట్టు మండల పశువైద్యాధికారిణి ఎం సౌజన్య దేవి

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 20**

ముంచంగిపుట్టు మండలంలో జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మండల పరిధిలో మంగళవారం 319 మూగజీవాలకు గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు నిర్వహించామని పశువైద్యాధికారిణి ఏం సౌజన్య దేవి అన్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని బాకుబెడలో 46 మూగ జీవాలకు, బంగారుమెట్టలో 53, తలబిరడ లో 124, కుంబిగూడ 38, క్రిముఖిపుట్టులో 58 మూగజీవాలకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశామన్నారు. ఈనెల 20వ తేదీ నుండి సెప్టెంబర్ 18 వ తేదీ వరకు జాతీయ పశువు వ్యాధి నియంత్రణ పథకం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 4నెలలు దాటిన దూడ పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు ప్రతి రైతు వేయించాలన్నారు. మూగజీవులకు జ్వరం, దగ్గు, ఎద్దులలో పనిలో సామర్థ్యం కొద్దిపాటి ఎండకు రొంపడం వంటి వ్యాధి లక్షణాలు ఉంటాయని, ప్రతి రైతు నిర్లక్ష్యం చేయకుండా పశువైద్య సిబ్బందిని సంప్రదించి మూగజీవాలకు టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు వేయిస్తే దానివల్ల లాభాలపై పాడి రైతులు తెలుసుకోవాలన్నారు. టీకాలు మూగజీవాలకు వేయించడం ద్వారా మరణాలు సంభవించకుండా ఆరోగ్యంగా ఎదుగుదలకు ఎంతో




దోహద పడుతుందని అన్నారు. ప్రతి రైతు పశు వ్యాధి నియంత్రణ పథకం ద్వారా చేపట్టే కార్యక్రమంలో పశువైద్య సిబ్బందిని సంప్రదించి మూగజీవాలకు వ్యాధి నిరోధక



టీకాలువేయించుకోవాలని ఆమె రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రఘునాథ్, రమేష్, వెంకటేష్, యమునా, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సస్యరక్షణ పద్ధతులపై ప్రతి రైతు అవగాహన పెంచుకోవాలి

### మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు



**చింతపల్లి ఆగస్టు 20 పెన్ పవర్**

సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై ప్రతి రైతు అవగాహన పెంచుకొని వ్యవసాయం చేస్తే సత్ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని మండల వ్యవసాయ అధికారి బి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తాజంగి పంచాయతీ లో రేగు బయలు గ్రామంలో జాతీయ ఆహార భద్రత పథకం లో భాగంగా ఏర్పాటు చేసిన వేరుశనగ పంట డెమో ప్లాట్ ను రైతులతో కలసి పరిశీలించిన ఆయన గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి ఈ పంట నమోదు పై, వివిధ పంటల్లో సమగ్ర సస్యరక్షణ పద్ధతలు పై, ప్రధానమంత్రి ఫసల్ భీమా పథకం,ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ పంటల మద్దతు ధరలపై, పొలం సరి హద్దులలో ట్రెంచెస్ ఏర్పాటు, పొలంలో ఫార్మ్ పాండ్ నిర్మాణం, నీటి నిల్వ పై రైతులతో చర్చించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

## నిరసన ర్యాలీ చేసిన, జనసేన కార్యకర్తలు



**చింతపల్లిఆగస్టు 20 పెన్ పవర్**

జనసేన పార్టీ అధ్యక్షుడు శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ గారు ఆదేశాల మేరకు ఈరోజు చింతపల్లి జనసేన పార్టీ మండల అధ్యక్షులు వంతల బుజ్జి బాబు ఆధ్వర్యంలో చింతపల్లి మండల కేంద్రనికి ఈ నెల 9వ తేదీనా కోల్ కతా కారు జూనియర్ మెడికల్ కళాశాల వైద్య విద్య డాక్టర్ పై నిర్భయంగా హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలని మద్దతు తెలుపుతూ రాత్రి 7గంటలకు నిరసన ర్యాలీ నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా బుజ్జి బాబు మాట్లాడుతూ సమాజంలో సంఘ సభ్యులుగా మన దేశానికి, రాష్ట్రానికి,తల ఎత్తి తిరిగే స్వేచ్ఛ హక్కు, భద్రత హక్కు, జీవించే హక్కు మహిళలకు బలంగా అమలు చేసి మహిళల సంక్షేమం అభ్యున్నతి కోసం ఈ హక్కులని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కవచంగా ఉండేవిధంగా చూడాలని లేని పక్షంలో ప్రభుత్వాలు చేసే చట్టాల హక్కులను అర్థం లేకుండా రక్షణకి కరువవుతుందని ప్రతి మహిళ స్వేచ్ఛ సమగ్రాభివృద్ధి ఎక్కడ సాధ్యమో ఆ సమాజానికి జీవించే విధంగా ప్రతి మహిళ బాధ్యతగా ఎదిగే విధంగా తన తోటి వారి హక్కులను గౌరవంగా భంగం వాటిల్లని విధంగా చట్టం విధించిన పరిమితులకు లోబడి తన హక్కులను స్వేచ్ఛను అనుభవించే విధంగా మహిళ రక్షణ చట్టాలు తేవాలని కోరారు ఈ కార్యక్రమంలో.. ,ఉపాధ్యక్షులు కీముడు క్రిష్ణ మూర్తి, కొర్ర కృష్ణ రావు, వంతల చిరంజీవి,చరణ్,మహేష్,జగపతి,కన్నబాబు, జనసైనికులు పాల్గొన్నారు.

## చిత్ర పరిశ్రమకు అనువైన ప్రాంతం ఉత్తరాంధ్ర

### *జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు*

**విశాఖ సిటి, పెన్ పవర్, ఆగస్టు 20**

సినీ కళాకారుల సమస్యల పరిష్కారానికి, వారికి చిత్రాలలో అవకాశాలకు ప్రోత్సహించేలా తెలుగు మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (టీమా) పనిచేయాలని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు అన్నారు. చిత్ర సీమకు అనువైన ప్రాంతంగా ఉత్తరాంధ్ర పేరు పొందిందని పేర్కొన్నారు. విశాఖ నగరంలో అక్కయ్యపాలెం, జగన్నాథపురం లో తెలుగు మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఉత్తరాంధ్ర కార్యాలయాన్ని గంట్ల శ్రీనుబాబు ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించా రు. అనంతరం జరిగిన కళాకారుల సమావేశం లో ఆయన మాట్లాడారు.తెలుగు సినీ పరిశ్రమకు పూర్వ వైభవం సంతరించుకుం టుందని ఆయన చెప్పారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అనేక మంది కళాకారులు సినీ పరిశ్రమ లో ఉన్నత స్థానాలలో ఉన్నారన్నారు. కొత్తగా సినీ రంగంలో అడుగు పెట్టాలనుకుంటు న్న ఉత్తరాంధ్ర కళాకారులను స్థానిక సినీ అసోసియే షన్ లు సహకరించవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. సినీ పరిశ్రమకు సంబంధించి అన్ని హంగులతో ఈ కార్యాలయాన్ని తీర్చిదిద్దా లన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు పి.వెంకట్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ బెల్లం జయ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.కృష్ణకిషోర్ లతో పాటు ఇతర ప్రతినిధులను గంట్ల శ్రీనుబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఉపాధ్యక్షులు పాండురంగ విటల్, ఒంగోలు ఉపాధ్యక్షులు సతీష్, సంయుక్త కార్యదర్శి ఆర్.ఎం.కే.శర్మ, కార్యనిర్వాహక కార్యదర్శిలు రమేష్ యాదవ్, వెంకట్, విజయనగరం జిల్లా అధ్యక్షులు గద్దె వరప్రసాద్, లీగల్ అడ్వైజర్స్ మోది రాజేశ్వర రావు, ఈశ్వర్ చంద్రశేఖర్, విశ్రాంతి పోలీస్ అధికారి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



### ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

# జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలి

### *జనసేన పార్టీ అరకు పార్లమెంట్ పాడేరు ఇంచార్జ్*

### *డాక్టర్ వంపూరి గంగులయ్య*

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఆగస్టు 20**

ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోనికి రావడానికి, వైసిపి గద్దె దిగటానికి ప్రధాన సూత్రధారి అయిన జనసేన పార్టీ అధినేత,ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ యొక్క జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడానికి జన సైనికులు సంసిద్ధం కావాలని జనసేన పార్టీ అరుకు పార్లమెంట్,పాడేరు ఇంచార్జ్ డాక్టర్ వంపురి గంగులయ్య పిలుపునిచ్చారు.రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా,ఐదు శాఖలకు మంత్రిగా మనకందరికీ ఆశాజ్యోతి గా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న వ్యక్తిగా, ఆదర్శవంతమైన రాజకీయాలతో సామాన్యుల దగ్గర నుంచి మేధావుల వరకు ప్రతి ఒక్కరి మన్ననలు పొందుతున్న తరుణంలో ఆయన జన్మదిన వేడుకలు ప్రత్యేకత సంతరించుకున్న విషయం ప్రతి ఒక్క జన సైనికుడికి తెలిసిందే అని, జనసైనికులు అందరూ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాలను నిర్వహించాలని గంగులయ్య పిలుపునిచ్చారు.వ్యక్తిగత ఎజెండా,స్వార్థపూరిత ఆలోచనలు పక్కన పెట్టి సెప్టెంబర్ రెండవ తేదీన పవన్ కళ్యాణ్ యొక్క జన్మదిన వేడుకలు నిర్వహించటంలో అన్ని వర్గాల ప్రజలు మరియు అధికార అనాధికారుల మన్ననలు పొందే విధంగా జన్మదిన వేడుకలు నిర్వహించాలని ఆకాంక్షిస్తున్నామని వివరించారు.జనసేన పార్టీ నాయకులు,వీర మహిళలు జనసైనికులు మరియు ప్రజల యొక్క భాగస్వామ్యంతో పవన్ కళ్యాణ్ యొక్క జన్మదిన వేడుకలు నిర్వహించటానికి కృషి చేయాలని అన్నారు.ఇందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రమైన పాడేరులో ఘనంగా నిర్వహించడంలో పాడేరు జి. మాడుగుల మండలాల నాయకులు జన సైనికులు ప్రధాన




భూమిక పోషించాలని,అదేవిధంగా ప్రతి సంవత్సరం మాదిరిగానే చింతపల్లి గూడెం కొత్త వీధి కొయ్యూరు మండలాలలో వారి వారి మండల కేంద్రాల్లో జనసేన నాయకులు ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించాలని,పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి సమాజ హితం కోసం ఆలోచన చేయాలని కోరుతున్నామని డాక్టర్ వంపూరి గంగులయ్య తెలిపారు.

## చింతపల్లి ఎంపీడీవోగా ఆశాజ్యోతి



**చింతపల్లి ఆగస్టు 20 పెన్ పవర్**

చింతపల్లి ఎంపీడీవోగా ఆశాజ్యోతి నియమితులయ్యారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఆమెను కాకినాడ జిల్లా పెద్దాపురానికి బదిలీ చేశారు. అనంతరం సొంత జిల్లాల బదిలీల నేపథ్యంలో తిరిగి ఆమెను చింతపల్లి బదిలీ చేశారు. దీంతో మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె ఎంపీడీవో గా బాధ్యతలు చేపట్టారు.

# సిఆర్పిఎఫ్ డిఎస్పీ రంజిత్ కుమార్ బలగొత్ర ఆధ్వర్యంలో "ట్రీ ప్లాంటేషన్ డ్రైవ్" కార్యక్రమం

### మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు

### పాఠశాల విద్యార్థులకు వాలీబాల్ కిట్ అందజేత విద్యార్థులు క్రీడల్లో రాణించాలి.

### -సిఆర్పిఎఫ్198/జి బెటాలియన్ డిఎస్పీ రంజిత్ కుమార్ బలగోత్ర



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 20**

మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, పాఠశాల విద్యార్థులు క్రీడల్లో రాణించాలని సిఆర్పిఎఫ్ 198/జి బెటాలియన్ డిఎస్పీ రంజిత్ కుమార్ బల గోత్ర అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గల స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల1 ఆవరణంలో డిఎస్పి రంజిత్ కుమార్ బలగోత్ర ఆధ్వర్యంలో "ట్రీ ప్లాంటేషన్ డ్రైవ్" కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఎస్పీ రంజిత్ కుమార్ బలగోత్ర మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరీక్షించుకోవాలని ఆయన అన్నారు. మొక్కలు నాటాలని దాని ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి దోహద పడుతుందన్నారు. దీంట్లో భాగంగానే గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర1 పాఠశాల ఆవరణంలో సిఆర్పిఎఫ్ సిబ్బంది, పాఠశాల సిబ్బందితో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. పరిసర ప్రాంతాల్లో గృహాల్లో మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని, ప్రతి ఒక్కరూ చెట్లను పెంచుకోవాలని విద్యార్థులకు పలు సూచనలు సలహాలు అందించారు.అనంతరం విద్యార్థులకు వాలిబాల్ కిట్ అందించి విద్యతోపాటు క్రీడల్లో కూడ రాణించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ సిబ్బంది, ఉపాధ్యాయలు మాణిక్యాలరావు, ధనుంజయ, భగత్ రాం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## అనాధాశ్రమంలో ఆదివాసి విద్యార్థులు మరణం చాలా బాధాకరం

### విద్యార్థుల కుటుంబాలకు 25 లక్షల ఎక్స్ గ్రెషియా చెల్లించాలి

### బాధ్యులైన దోషులను కఠినంగా శిక్షించాలి

### గిరిజన సంఘం నేతలు కొర్ర త్రినాథ్, గాసిరందొర



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 20**

కైలాసపట్నం అనాధాశ్రమంలో గిరిజన విద్యార్థులు మరణించడం చాలా బాధాకరమని, తక్షణమే మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు 25 లక్షలు ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం నేతలు కొర్ర త్రినాథ్, సొలగం గసిరామ్ దొర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మంగళవారం పాత్రికేయులతో మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా, కోటవురట్ల మండలం, కైలాసపట్నంలోని పరిశుద్ధాత్మ అగ్ని స్తుతి ఆరాధన ట్రస్ట్ అనాథాశ్రమంలో జరిగిన ఘటనలో అమాయక ఆదివాసీ విద్యార్థులు కలుషిత ఆహారం తిని మృతి చెందటం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది అన్నారు. ఈ ఘటనలో అమాయక ఆదివాసీ గిరిజన విద్యార్థులు మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. ఘటనలో తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని, సరైన పర్యవేక్షణ కొరవడడంతోనే ఈ ఘటన జరిగిందని, వెంటనే ఘటనపై సమగ్రమైన విచారణ జరిపి బాధ్యులైన దోషులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం మరణించిన విద్యార్థుల కుటుంబాలకు 25 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని, వారి కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

